

సెల్లార్ తవ్వకం.. కుంగిన రోడ్డు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్‌లోని గౌతమీనగర్‌లో సెల్లార్ తవ్వకంతో మరోమారు రోడ్డు కుంగింది. కాలనీ రోడ్డును ఆనుకొని ప్రణీత్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బహుళ అంతస్తుల భవన నిర్మాణం కోసం సుమారు 60 అడుగుల భారీ సెల్లార్ గోతిని తవ్వింది. గత ఏడాది జూన్ 29న సెల్లార్ తవ్వకంవల్ల రోడ్డు కుంగి, డ్రైనేజీ పైపులైను పగిలింది. ఆదివారం సాయంత్రం గతంలో రోడ్డు కుంగిన చోట తిరిగి అదే సమస్య పునరావృతమైంది. దీంతో రోడ్డు పక్కన ఉన్న పలు భవనాల యజమానులు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సెల్లార్ గొయ్యి వల్ల ఇప్పటికే రెండుసార్లు రోడ్డు కుంగిందని, తమ ఇళ్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సంఘటనా స్థలాన్ని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వరరావు, సత్యంగౌడ్, కావూరి ప్రసాద్, వెంకటేష్, టీడీపీ నాయకులు కొడాలి రవికుమార్, మాలెంపాటి సురేష్, వెంకటేశ్వర్లు పరిశీలించారు.

పర్యాటక- ఆతిథ్య రంగాల్లో..
నిథమ్ విద్యార్థులకు ప్రపంచ స్థాయి గుర్తింపు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాయదుర్గం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పర్యాటక-ఆతిథ్య రంగాల్లో ఉన్నత స్థాయి ప్రమాణాలతో విద్య అందిస్తున్న తెలంగాణలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించడం విశేషమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యూరప్ లాట్వియా వల్మియరాలోని విడ్జెమ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్(వీయూఏఎస్)లో టూరిజం హాస్పిటాలిటీ కోర్సును అభ్యసించడానికై యూరోపియన్ యూనియన్ ఎరాస్మస్ ఫెలోషిప్‌నకు ఎంపికైన నిథమ్ విద్యార్థులు డి.సాయిరక్షిత, ఎన్.సుష్మశ్రీలను మంత్రి అభినందించారు. ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతి పొందిన యూనివర్సిటీలో చదవడానికి నిథమ్ విద్యార్థులు ఎంపిక కావడం హైదరాబాద్‌లోని సంస్థ అవలంబిస్తున్న ప్రపంచశ్రేణి ప్రమాణాలకు నిదర్శనమని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. సోమవారం శాసనసభ భవనం మంత్రి చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి, నిథమ్ చైర్ పర్సన్ శైలజారామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ నిఖిల, అసిస్టెంట్ ప్రొఫెసర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పదస్థితిలో గృహిణి మృతి



సంధ్యారాణి ఫైల్

జీడిమెట్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ గృహిణి మృతి చెందింది. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీలో జరిగింది. దేగుల సంధ్యారాణి(37), సంతోష్‌కుమార్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సంతోష్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. కుటుంబంతో కలిసి హెచ్ఏఎల్ కాలనీలో ఉంటున్నారు. వీరికి 2013లో వివాహమైంది. ఆ సమయంలో అత్తింటి వారు నగలు, నగదు కట్నంగా ఇచ్చారు. కొంతకాల తర్వాత భర్త, అత్తామామ, ఆడపడుచులు వేధింపులకు గురిచేసేవారు. జీవితంపై విరక్తి చెందిన సంధ్యారాణి పలుమార్లు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి వీరు పెట్టే బాధలు భరించలేకపోతున్నానని ఏడ్చేది. ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని తల్లి దండ్రులు నచ్చజెప్పేవారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో సంధ్యారాణి అనుమానాస్పద స్థితిలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి సరిత మాత్రం తమ కుమార్తెను ఒక పథకం ప్రకారం హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.



శిక్షణ కార్యక్రమంలో అధికారులు

రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు రూపొందించిన మార్గదర్శకాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు, రోడ్డు సేఫ్టీ అధికారులు సోమవారం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ పర్యవేక్షణలో నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సర్వీసెస్, ఐఐటీ మద్రాస్ కలిసి ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఆర్ఏడీ)ని రూపొందించారు. ఈ అప్లికేషన్‌ను అమలు చేయడంతో రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాల్లోని మరణాలను 50 శాతం తగ్గించడమే లక్ష్యంగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, హైవే, ఆరోగ్యం, మోటార్ యాక్సిడెంట్ క్లెయిం ట్రిబ్యునల్, ఇన్సూరెన్స్, లీగల్ సర్వీసెస్ కలిసి పనిచేస్తాయి. డిస్ట్రిక్ట్ రోల్ అవుట్ మేనేజర్లు అమీర్ అలీ, సతీష్ ఈ అప్లికేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గురవయ్య, ఎస్ఐ శ్వేత, సిబ్బంది ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల శ్రమదానం

రాయదుర్గం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ నిపుణులు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జర్నలిస్టుల కాలనీలోని పార్కులో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని శుభ్రం చేశారు. రాయదుర్గం నాలెడ్జ్‌సిటీ ప్రాంతంలోని స్కైవ్యూ టవర్స్‌లోని డీబీఎస్ కంపెనీకి చెందిన 150మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బస్సులో వచ్చి ఈ శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

'గోవులను రక్షించాలి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జయనగర్ కాలనీలో స్వదేశీ నేచురల్ ప్రొడక్ట్స్ దేశీ ఆవుపాల విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత గోసేవ ఫౌండేషన్ నిర్వాహకులు బాలకృష్ణ గురుస్వామి, జగద్గురు మధ్వాచార్య గో సేవా సంస్థ నిర్వాహకులు వడ్డి కృషి హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ గోవులను రక్షించాలని, ఆధునిక సైన్స్ వల్ల సాధ్యంకానీ ఎన్నో విషయాలు మానవ జీవనంలోని అలంకాలను అదిగమించేందుకు ఆవు ద్వారా వంద శాతం సాధ్యమతుందని వారన్నారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చందానగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 760 గ్రాముల హాష్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, చందానగర్ ఎస్ఐ శ్రీధర్ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా ఆటోలో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారు పోలీసులను చూసి ఆటోవదిలి పారిపోతుండగా పట్టుకుని 760గ్రాముల హాష్ ఆయిల్‌తో పాటురెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాంకుళం జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్(32) నగరానికి వచ్చి బోరబండలో ఉంటూ విడ్ ఆయిల్ సరఫరా చేస్తున్నాడు. విశాఖపట్నానికి చెందిన సాయికుమార్(28) విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బిర్యాని సెల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన రాజారావు హాష్ ఆయిల్ తెలంగాణకు సరఫరా చేస్తున్నాడు. వీరి ముగ్గురికి పరిచయం ఏర్పడింది. విశాఖపట్నం నుంచి హాష్ ఆయిల్‌ను తెలంగాణకు తీసుకొచ్చి అమ్ముతుంటారు. ఈ ఆయిల్‌ను గంజాయితో కలుపుతారు. వీరు సరఫరా చేస్తున్న సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి ప్రవీణ్, సాయికుమార్‌ను అదుపులోకి తీసుకోగా రాజారావు తప్పించుకుని పారిపోయాడు. వారి నుంచి 760గ్రాముల హాష్ ఆయిల్, రెండుసెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ప్రజావాణిలో ఫిర్యాదులు అందుకుంటున్న డీసీ నర్సింహ

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 29 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 2, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 9, గాజులరామారం 7, అల్వాల్ 0, జోనల్ కార్యాలయంకు సంబంధించినవి 10 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. రోడ్లు, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, పార్కులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా అందాయి. జోనల్ కార్యాలయానికి సంబంధించిన ఫిర్యాదు దారులతో జెడ్సీ అభిలాష అభినవ్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి నివేదికను అందజేయాలని అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్లకు చెందిన అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్లాస్టిక్ నిషేధం

షాపూర్‌నగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కొలా రవిందర్ ముదిరాజ్ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోల్‌సేల్ తయారీ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకొని, నాణ్యమైన కవర్లు, చేతిసంచులు వాడేలా విద్యార్థులకు, ప్రజలకు జీహెచ్ఎంసీ, ప్రజా సంఘాలు, దేవస్థాన కమిటీలు అవగాహన పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు బీవీపీ అబ్దుల్‌కలామ్, ఎన్. బిక్షపతిగౌడ్ ఉన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీల్లో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని, వాటిని కాపాడాలని సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బౌరంపేట సర్వే నెంబరు 166/23లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్ సర్వీస్‌మెన్ భూమిని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధి 2014లో అక్రమ రిజిస్ట్రేషన్ చేసి, దాదాపు 30 కుంటల ప్రభుత్వ భూమిని అదనంగా ఆక్రమించుకొని, ప్రహరీ నిర్మించడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సర్వేనెం. 134ఎర్రకుంట, 186 సాయినగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని, సీపీఐ పేరు మీద అనుమతులు తీసుకోవడంపై విచారణ జరిపించాలని కోరారు. సర్వే నెంబరు 191లో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు, సర్వేనెం. 109లో రెడ్డి ఎవెన్యూ పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమ సర్వేనెం. 165లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపించి, ఈ భూములను కాపాడాలని అధికారులను కోరారు.

ప్రజావాణికి 16 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో సీసీ రోడ్లు వేయాలని 2, అక్రమ నిర్మాణాలపై 3, రెవెన్యూ సమస్యలపై 2, యూబీడీ, వీధి దీపాలపై ఒక్కో ఫిర్యాదు చొప్పున మొత్తం 9 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం సర్కిల్‌కు గాను మొత్తం 7 ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజనీరింగ్‌కు 4 ఫిర్యాదులు, వీధి దీపాలకు సంబంధించి 2 ఫిర్యాదులు, యూబీడీకి ఒక్క ఫిర్యాదు ఉన్నాయి. ఈ కార్యక్రమాల్లో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, ఎల్‌పీ. మల్లయ్య, ఏఎంసీలు ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణ, డీసీపీలు సాయిబాబా, సంతోష్‌కుమర్, ఏఎంవోహెచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవ నారాయణ, ఈఈ కృష్ణచైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

చందానగర్: ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ఉద్దేశమని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. సర్కిల్ కార్యాలయం సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు కాలనీలకు చెందిన ప్రజలు వచ్చి సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా శానిటేషన్, ఇంజనీరింగ్ టౌన్‌ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంతిని, ఎఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈడీ కార్యక్రమాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈడీ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ చంద్రశేఖర్

బాలానగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఎంఎస్ఎంఈడీ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు పారిశ్రామిక వేత్తలకు ఎంతో దోహద పడుతున్నాయని కేంద్ర ప్రభుత్వ రంగ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ సంస్థ(ఎంఎస్ఎంఈడీ) అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ అన్నారు. ఎంఎస్ఎంఈడీ, ఫెసిలిటేషన్, అడిషనల్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సంస్థ ఆడిటోరియంలో ఎగుమతి, మార్కెటింగ్, డాక్యుమెంటేషన్ విధి విదానాలపై ఏర్పాటు చేసిన 5రోజుల అవగాహన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈఎస్‌డీపీ, ఎండీపీ, శిక్షణా కార్యక్రమాలు, ఉద్యం రిజిస్ట్రేషన్, ఉద్యం అసిస్టెంట్ వంటి ప్రయోజనకర పథకాలపై యువ పారిశ్రామిక వేత్తలు అవగాహన కల్గి ఉండాలన్నారు. డిప్యూటీ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ డిప్యూటీ డైరెక్టర్ డా.పున్నకుమార్ మాట్లాడుతూ ఫారిన్ ట్రేడ్, సెజ్ పాలసీ విధానాలు, ఎగుమతి కార్యాచరణ ప్రణాళికలను విశదీకరించారు. కార్యక్రమంలో ఆదిష్కా ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎస్. రామనాథన్, లీడ్ ఫ్యాకల్టీ ఎస్, అయ్యర్, ఎంఎస్ఎంఈడి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వి. సుధీర్‌కుమార్ ప్రోగ్రాం కంటెంట్‌ను వివరించారు.

క్రీడల్లో సత్తా చాటిన మహిళా కండక్టర్లు



మెడల్స్, ప్రశంసా పత్రాలతో కండక్టర్లు మంజుల, శ్రీదేవి, మల్లిలక్ష్మారెడ్డి చేతుల మీదుగా మెడల్ ప్రశంశా పత్రాన్ని అందుకుంటున్న ఆర్టీసీ కానిస్టేబుల్ సోమేశ్వర్‌రావు

ఫతేనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలోనే కాదు క్రీడల్లో సైతం సత్తా చాటుతామని టీఎస్ ఆర్టీసీ సిబ్బంది నిరూపించారు. ఈనెల 8 నుంచి 11 వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్-2024లో నిర్వహించిన పోటీలో 20రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది(రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీఎస్ ఆర్టీసీ నుంచి 12) మంది ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. వీరిలో కూకట్‌పల్లి డిపో కండక్టర్ మంజుల హైజంప్(గోల్డ్‌మెడల్), లాంగ్‌జంప్, టిపుల్ జంప్‌లో(సిల్వర్ మెడల్)ను, ఇదే డిపోకు చెందిన కండక్టర్ శ్రీదేవి 300 మీటర్ల హడల్స్‌లో సిల్వర్ మెడల్‌ను సాధించారు. మియాపూర్ డిపో-2లో ఆర్టీసీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎల్. సోమేశ్వర్‌రావు ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్‌ను సాధించారు. ఈముగ్గురు ఎంఎల్‌ఆర్ గ్రూప్ విద్యా సంస్థల చైర్మెన్ మర్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు.

బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదిక సమాచార ప్రతులను చూపుతున్న ప్రతినిధులు

అల్లాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్ఎస్ఎస్) వెస్ట్ జోన్ ఆధ్వర్యంలో మూసాపేట్ డివిజన్ పాండురంగా నగర్ కాలనీలోని విజేత విద్యాలయాల్లో 'వివాహ పరిచయ వేదిక- 2024'ను నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోని బ్రాహ్మణ బంధువులను ఒకే వేదిక పైకి తేవాలన్న ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమం విజయవంతం అయిందని, సుమారు 650 మంది దరఖాస్తు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి వివాహ సమాచార పుస్తకాన్ని అందించామని, 11 మంది వధూవరుల తలిదండ్రులకు ఈ పరిచయ వేదికగా ముఖాముఖి చర్చకు, వివాహ అంగీకారానికి ఆస్కారం కల్గినట్టు సమాఖ్య ప్రతినిధి తెలిపారు.

- బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం 2024 - 2027 కాలానికి చైర్మెన్‌గా చక్కిలం సుధాకర్, ప్రెసిడెంట్‌గా సి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కూచి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐ.ఎస్.రమేశ్, టి.డి.వి.ప్రసాద్, కె.కాంతరావు, రాయప్రోలు రాఘవ శర్మ, రామచంద్రరావు, జయలక్ష్మి, అనిత, కస్తూరి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావు అందరివాడు



నివాళులర్పిస్తున్న రెక్టార్ విజయకుమార్ రెడ్డి, వర్సిటీ ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలో అందరికీ కావాల్సిన వ్యక్తిగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు మెలిగారని జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి అన్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ కారణంగా గత శనివారం ఈసీఈ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాసరావు మృతి చెందిన నేపథ్యంలో.. సోమవారం ఇంజనీరింగ్ కాలేజీలో సంతాపసభ నిర్వహించారు. సంతాపసభలో పాల్గొన్న వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. శ్రీనివాసరావు మంచి వ్యక్తిత్వం కలిగిన మనిషని చెబుతూ కంటతడి పెట్టారు. ఈసీఈ విభాగాధిపతి రజని మాట్లాడుతూ.. ప్రొఫెసర్ శ్రీనివాసరావు మృతి తమ విభాగానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు.. శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వేర్వేరు ప్రాంతాల్లో 173 కిలోల గంజాయి పట్టివేత

- విలువ రూ.46 లక్షలు
- ఐదుగురి అరెస్టు, పరారీలో ఆరుగురు

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.

శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 109 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ. 30 లక్షలు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద పట్టుకున్నట్టు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.

- మరో ఘటనలో అక్రమంగా తరలిస్తున్న 64 కిలోల గంజాయిని సోమవారం చేవెళ్లలో పోలీసులు పట్టుకున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్ మోహిత్, నౌనాథ్ గణపత్‌చౌహన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాశ్‌మొహితే, రేఖ, మనోజ్‌సింగ్‌పీ, లాము పాలాటీ ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి గంజాయితోపాటు ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. వారి నుంచి రూ.16 లక్షల విలువైన 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణపత్, మాధన్‌లను రిమాండ్‌కు తరలించారు.



- మాజీ ఉప రాష్ట్రపతి పద్మవిభూషణ్ గ్రహీత, బీజేపీ సీనియర్ నాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడును కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. గచ్చిబౌలీ అన్వేయ కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన సత్కార కార్యక్రమంలో వెంకయ్య నాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

\- బాలానగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)

ప్రజలు సుఖ శాంతులతో ఉంటారు

- భవిష్యవాణి వినిపించిన రాజేష్



కట్టమైసమ్మ గుడి వద్ద భవిష్యవాణి వినిపిస్తున్న రాజేష్

షాపూర్‌నగర్, పిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కట్టమైసమ్మ జాతరలో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అమ్మవారు ఆహ్వానించిన రాజేష్ భవిష్యవాణి వినిపించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజేష్ భవిష్యవాణి వినిపిస్తూ ఈసంవత్సరం అంతా ప్రజలు సుఖశాంతులతో, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారని, వర్షాలు విస్తారంగా కురుస్తాయని, పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని చెప్పారు. ఆలయ ప్రాంగణం సరియైన స్థలం లేక నావద్దకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఖరు రోజు బుధవారం భక్తులు సమర్పించిన వడి బియ్యంతో అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్ ప్రదానం



అవార్డుగ్రహీతలు, నృత్యకళాకారులతో అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్‌స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్-2024 ప్రదానం కళాదీక్షితులు హాలులో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో నాట్యగురువులు డా.యం.క్రిష్ణప్రియ, కేఎన్.రాజేశ్వరీ శ్రీధర్‌ల శిష్య బృందం తమ నృత్య ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకున్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు సోమవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. నాలుగోఫేజ్ ఎంఐజీ ఫ్లాట్స్, ఐదోఫేజ్ జీహెచ్ఎంసీ పార్కు, 9వ ఫేజ్ పొలిమేర షాపు, సర్దార్‌పటేల్‌నగర్, ఎస్ఎస్ కాలనీల్లో శంకుస్థాపన చేశారు.

మినీ ఫంక్షన్‌హాల్ ప్రారంభం



వీవీనగర్‌లోని సొసైటీ ఆవరణంలో ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వీవీనగర్‌లోని కాలనీ సొసైటీ కార్యాలయ ఆవరణంలో కాలనీ అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సహకారంతో నిర్మించిన మినీ ఫంక్షన్‌హాల్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. కాలనీలోని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టిన రాజేశ్వరరావును గాంధీ అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవి, నాయకులు మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



త్రిషను సన్మానించిన జగన్‌మోహన్‌రావు

క్రికెటర్ త్రిషకు సత్కారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఎంపికైన హైదరాబాద్ క్రికెట్ త్రిషా పూజితను హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అభినందించారు. సోమవారం మాదాపూర్‌లోని ఆయన కార్యాలయంలో జగన్‌ను త్రిష మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా త్రిషను జగన్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. డబ్ల్యూపీఎల్‌లో వచ్చే ప్రతి అవకాశాన్ని వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో బాగా రాణిస్తే టీమిండియాలో చోటు దక్కించుకోవడం సులభమవుతుందని చెప్పారు. హెచ్‌సీఏ తరఫున పూర్తి సహాయ సహకారాలందిస్తామని త్రిషకు జగన్ హామీ ఇచ్చారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా వెంకారెడ్డి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్డీఓ కె.వెంకారెడ్డి బదిలీపై రానున్నారు. ఇక్కడ గతంలో పనిచేసిన శ్రీనివాస్‌రావు రెండున్నర నెలల క్రితం అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అప్పటి నుంచి రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య శేరిలింగంపల్లికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని తహశీల్దార్‌ను జహీరాబాద్‌లో పనిచేస్తున్న ఆర్డీఓ వెంకారెడ్డిని బదిలీ చేశారు. ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

కొంపల్లి కాంగ్రెస్ మహిళా విభాగం కమిటీ నియామకం

పేట్‌బషీరాబాద్, పిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కమిటీని నియమించారు. ఈ నియామక పత్రాలను కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు చల్లా మాదవి రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మహిళలకు కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. ఉపాధ్యక్షురాలుగా కె.మమత, సెక్రటరీగా డి.రాధ, జనరల్ సెక్రటరీగా కె.లలితమ్మ, జాయింట్ సెక్రటరీగా పి.స్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ.రత్నమ్మను నియమించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



దరఖాస్తు దారుల వివరాలు తెలుసుకుంటున్న యుగంధర్‌రెడ్డి

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఫతేనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యం.యుగంధర్‌రెడ్డి ఇందిరానగర్ బస్తీ వాసులకు సూచించారు. బస్తీలో 200 యూనిట్ల ఉచిత కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను విద్యుత్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల నరేందర్ ముదిరాజ్, ప్రసన్న కుమార్, చెన్నయ్య, రాజు, సత్యం, నాగేశ్, లైన్ మెన్ గణేష్ పాల్గొన్నారు.